# బ ది లీ

## (ఒక యువతి ఒక యువకునికి రాసిన ఉత్తరాలు)

I — 6-4-194—

ఆరు నెల్లాయి ఒక్కలాగ చూస్తున్నాను మీ వాళకం. మా ఇల్లంతా ఒక గది, ఒక వసారా. అంచేత మా సంసారమంతా వీధిలో వుంటుంది. మీకంటే పెద్ద మేడున్నాది! అదెక్కి కూచుంటారు. మా బతుకంతా బట్ట బయలుగా మీకు కనబడుతుంది. మిమ్మలిని తప్పించుకొని ఇంట్లో మెస లడం కష్టంగావుంది. పెరట్లో కెళ్ళినా మీరు ప్రత్యక్షం. మీరు పుస్తకం పట్టుకుని చదువుతున్నట్టు నటిస్తూ కూచుంటారు. కాని నేనొక్కలాగ కని పెడుతున్నాను. తెల్లారితేచాలు మేడెక్కి నా కెదురుగా కూచుని నన్ను వెర్రెత్తిస్తున్నారు. ఆరు నెల్లాయి ఒక్కలాగ నన్ను వెర్రెత్తిస్తున్నారు. మీకు న్యాయంగా వున్నదా? ఎవరైనా చూస్తే ఏమనుకొంటారు? నా మొహంలో ఏముందని నన్నలాగ చూస్తూ బాధపెడుతున్నారు?

II — 7-4-194—

నీళ్ళు పోసుకొంటూవుంటే జబ్బకి చుర్రని రాయి తగిలింది. గతుక్కుమని తిరిగిచూస్తే డాబామూలని నవ్వుతూ మీరు కనబడ్డారు. వొళ్ళు చచ్చిపోయింది. ఉత్తరం రాయికికట్టి విసిరేరు. ఇవాళ నాకు పండుగలాగున్నాది. మొగుడుకి అక్కర్లేని ఆడది ఎవరికీ అక్కర్లేదను కొన్నాను. నే నేదో బాధపడుతున్నట్టు మీకెలాగ తెలిసింది? నా మొహం మీద రాసివున్నదా? మీరు వేలుచూపిస్తే మండ మింగుతారు. నా బాధలు చాలా ఉన్నాయి. మా ఆయన సంగతి మీరూ చూస్తున్నారు కదా! ఎలాగ అవుతుందో మీరే ఆలోచించి వ్రాయండి.

III 8-4-194—

మీ వీధి గదిలోకి నన్నే రమ్మన్నారు. అర్ధరాత్రి వీధిలోంచి ఆడది వెళుతూవుంటే అనుమానాలు పుడతాయి. ఏమీ లేకండానే వెయ్యి కల్పనలు కల్పించి పేర్లు పెడతారుకదా! నేనొస్తే ఎవరైనా చూస్తారేమో? అంతకన్నా మా పెరట్లోకి మీరే రండి. ఏదైనా అలికిడి అయితే వీధిలోకి మీరు వెళ్ళిపోవచ్చు. చడీచప్పుడూ కాకండా నేనింట్లోకి వెళ్ళిపోవచ్చును. సందులోంచి వస్తే మా పెరటిగోడ చాలా చిన్నది. గెంతీవొచ్చు. మానూతి చప్టామీద చాపేసుకొని పండుకొంటాను. వెన్నెల పుచ్చపువ్వులాగ రోజూ ఉంటున్నాది.

IV 9-4-194—

రాత్రి చప్టామీద నిద్రలేక దొర్లుతూ నాలుగు గంటలు కొట్టీదాకా చూశాను. ఆకు చప్పుడైతేచాలు మీరే వొచ్చేరనుకొని లేచి గోడమూలకి పారిపోతూ వొచ్చేను. మీరు ఎందుకు రాలేదో నాకు తెలియదు. నేను మాత్రం రాత్రంతా చూసిచూసి మీకోసం పిచ్చెత్తిపోయాను. నే నెప్పుడూ ఎవరికోసం ఇంత బాధపడలేదు. తెల్లారి చీపురుకట్ట చేతికి వొచ్చినదాకా నిప్పుల్లో వంకాయిలాగ నా గుండె ఉడికిపోయింది.

V 10-4-194—

మీ గదిలోకి రమ్మన్నారు. మీ పంతమే నెగ్గింది. ఎప్పుడూ మొగాళ్ళమాటే నెగ్గుతుంది. ఎక్కడా ఆడవాళ్ళమాట పడదు. మా నూతి చప్టాకన్నా మీ వీధి గది బాగుంది. నిజమే. మీరు పడుకొనే గది బాగుండదూ? నిన్న రాత్రి అన్నీ తెగించి, ఎక్కడలేని ధైర్యముతో మీ దగ్గరకి వొచ్చేశాను. కాని నేను భయపడ్డంతా అయింది. మా యింటిపక్క ముసలాయన అరుగుమీద కొర్రులా కూచున్నాడు. చూశాడేమో తెలియదు. వెన్నెల పట్టపగల్లాగుంది. నేనీరాత్రి మీ గదిలోకిరాను. మీరే మా పెరట్లోకి రండి. నా మీద ప్రేమ నిజమైతే ఒస్తారు.

VI 11-4-194—

నిన్నరాత్రి మీరు వచ్చేరు కారు. మీరు రాకపోతే నేనెంత బాధ పడుతానో ఆలోచించారుకారు. రాత్రి నా కళ్ళు మూతలుపడ్డాయి కావు. నిప్పులు పోసినట్లు వొళ్లు మండిపోయింది. ఇవాళ రాత్రి మీ గదిలోకి నన్నే రమ్మని రాశారు. మీరు నాకు కావాలి కాబట్టి నేనే మీదగ్గరికి రావాలి. నేను మీకు అక్కర్లేదు కాబట్టి నా దగ్గరికి మీరు రారు.

VII 12-4-194—

రాత్రి మీరు ప్రమాణం చేశారు. నేను చెప్పినట్టల్లా వింటా నన్నారు. నాకోసం ఎంతైనా తెగిస్తానన్నారు. మాట అన్నారు. అదే పది వేలు. ఈ జన్మకి అలాగనేవారు దొరుకుతారా? అని ఏడుస్తున్నాను. వీధిలో కూర్చొని మీ మేడ చూస్తూ ఇవాళ గంట ఏడ్చాను. నాకు మీ మేడలోకి వొచ్చెయ్యాలని ఉన్నాది.

VIII 13-4-194—

సానిముండ యింటి నుంచి మా ఆయన ఇవాళ పొద్దున్న ఏడింటికే వొచ్చేశారు. రాత్రి మీరిచ్చిన సువర్నరేఖ మామిడిపండు నంచుకొని చద్దెన్నం తింటున్నాను. చద్దెన్నం ఎంతో రుచిగా నోటికి వెళుతోంది. చద్దెన్నం తింటూ, మామిడిపండు నంజుకుంటూ మిమ్మలిని తలంచుకొంటు న్నాను. ధుమధుమలాడుతూ మా ఆయన రాక్షసుడిలాగ వొచ్చేరు.

'వెధవముండా మామిడిపండు ఎక్కడిది?'

అనడిగారు : నాకు మామిడిపళ్లు ఎక్కణ్ణుంచి వొస్తాయి శుభ్రమైన అన్నానికే వాచిపోతున్నాను.

'పక్కింటావిడ ఇచ్చిం'దని అబద్ధం చెప్పేను.

'వెధవముండా మొహమంత కులుకుతూ ఉన్నాదేం?' అనడిగారు.

'ఏడుస్తూ కూచోమన్నారా?' అన్నాను. ఏడిపించడమే కదూ ఆయన రోజు నాకు చేస్తున్నది. నేనంటే ఆయనకి కిట్టదు. సానిముండని

పెట్టుకుని దాని యధాన్ని కోడుతూ నన్ను కాల్చుకు తింటున్నారు. ఇంట్లో అనాధనిచేసి పస్తు పడుకో పెడుతున్నారు. నేను సుఖంగా ఉంటే ఆయనకి కిట్టదు. కాని ఇవాళ నేను కులుకుతున్న మాట నిజమే. ఆయన బాగానే కనిపెట్టేరు. ఇవాళేమి? మూడురోజులాయి నేను సంతోషం పట్టలేకుండా ఉన్నాను. కూచుని మీ గురించి ఆలోచించుకుంటే చాలు, శరీరం పిట్టలాగ తేలికైపోయి ఎక్కడికో ఎగిరిపోతుంది. గాలిపడగకి దారములాగ మీ ప్రేమ నా గుండెలకి ముడివేసుకొంది. గాలిపడగని దారం ఆకాశంలోకి ఎత్తుకుపోయినట్టు నా గుండెలని మీ ప్రేమ ఎక్కడికో లాక్కుపోతున్నాది.

IX 23-4-194—

ఇవాళ పొద్దున్న లక్ష్మీనరసమ్మగారు నన్నుచూసి 'ఏంటేవ్ మొగుడిబుద్ధి మారిందా ఏమిటి?' అనడిగారు. 'అంత భాగ్యం కూడానా? ఏమలాగడిగారు?' అన్నాను. 'మారుతాడు. తొందరపడకు నీ మొహంలో కొత్తగా పెద్ద కళ వచ్చింది. లక్ష్మీదేవిలాగ ఉన్నావు' అన్నారు. నా మొగుడు మొదట్లో నా అందానికి మోహించిపోయి పెళ్ళాడారు. కాని ఏం లాభం? వెధవ సహవాసాలుచేసి ముండలంపటం తెచ్చుకొన్నారు. నన్ను పాతాళానికి తొక్కేశారు. ఆ సానిముండ సరిగ్గా మనవీధి పాకీదానిలాగ ఉంటుందట. దీనిమొహం చూస్తే దానిమొహం చూడనక్కరలేదట. చూసినవాళ్ళు చెపతారు. మనవీధి పాకీదానితో సానిటరీ ఇన్స్పెక్టర్‌గారు పోతున్నాట్ట. సూటేసుకొని అతను తెల్లగా దొరలాగుంటాడు. అందరూ అలాగే చెపతారు. అదేం పోగాలమో మొగాళ్ళ బుద్ధులు ఎవళకీ బోధ పడవు. కాని లక్ష్మీనరసమ్మగారు చెప్పినది నిజమే. నాలో మార్పు వొచ్చింది. దానిక్కారణం రాత్రి మీరూ నేను అనుకొన్నమాట. ఆ మాట మరచిపోయారుసుమండీ! నేను సిద్ధంగా ఉన్నాను. ఇవాళ రాత్రిబండికి వెళ్ళిపోదాము. మా ఆయన రాత్రికి ఇంటికి రానేరారు. ముండయింట్లో ఏడుస్తారు. రాత్రిబండి యెక్కితే పొద్దున్నకల్లా బెజవాడలో దిగిపోతాము.

X 26-4-194—

రెండురోజులైపోయింది. రెండు రోజులూ రెండు యుగాల్లాగ

బాధపడ్డాను. నిముషం నిముషం ఒక ముల్లులాగ ఉన్నాది. అమాయకంగా మిమ్మల్ని నమ్ముకొన్నాను. మీరు తప్ప నాకు శరణులేదు. నిన్నరాత్రి మొన్నరాత్రి మీ గది దగ్గరకు ఎన్నిసార్లో వొచ్చాను. మీ గది తలుపువేసి ఉన్నాది. మిమ్మల్ని గట్టిగా పిలిచి పీధెక్కి పోదామనిపించింది. మళ్ళీ కొంప మునుగుతుందని వెళ్ళిపోయాను. ఇవాళ మీ గురించి భోగట్టాలు చేశాను. ఇన్నాళ్లు మీరెంత చెప్పితే అంతా నిజమనుకొనేదాన్ని. మీరు అంత ఘోరమైన ప్రమాణాలు చేస్తారని, అబద్ధాలు ఆడతారని కల్లో అనుకో లేదు. మీకు పెళ్ళి అయిపోయిందట. పెళ్ళాం కాపరానికి సిద్ధంగా ఉన్నాదిట. భుజంమీద మీకు జంజ్యమైన లేకపోవడాన్ని ఇన్నాళ్ళు తెలుసుకోలేక పోయాను. నన్ను నిష్కారణంగా గోతులో తోసేశారు. నిరాశ చేసుకొన్న బతుక్కి పెద్ద ఆశ తెచ్చిపెట్టేరు. ఇప్పుడు నా గొంతుక తెగని కత్తిపీటతో కోస్తున్నారు. మీ పెళ్ళాన్ని వొదిలిపెట్టి నన్ను లేవదీసుకపొమ్మని ఎలాగ చెపతాను? నన్ను వొదలకండి అని ఏడుస్తున్నాను. మొన్నరాత్రి బెజవాడ నిజంగా వెళ్ళిపోతామని అనుకొన్నాను. సిద్ధంగా కూచున్నాను. ఎంత ఆకాశానికి ఎగిరానో అంత పాతాళానికి మీరుకూడా తొక్కేశారు. మిమ్మలిని అందం ఎందుకు?

## XI

27-4-194—

నిన్న ఎలాగైతేనేం రానిచ్చారు. చాలు, మీ మీ పెద్దలకి వెయ్యివేల నమస్కారాలు. మిమ్మలిని వొదులుకోలేను. రాకుండా ఉండలేను. పంచప్రాణాలూ మీమీదే వుంటాయి. నేనో కుక్కని. సిగ్గులేకుండా తోకాడించుకుంటూ మీ దగ్గరికి వొస్తూవుంటాను. మీ బూటకాలు నమ్మి బుట్టలో పడతాను. ఇవాళ మరో భోగట్టా తెలిసింది. మీకేం? మరో అబద్ధమాడారు. మీకు ఎల్లుండి కార్యం అవుతుందట. రేపు మీరంతా బయలుదేరి వెళతారట. ఇంక నేను మీకు కనబడనే కనబడను. ఇన్నాళ్ళు ఇంకోవిధం లేక నన్ను రానిచ్చేరు. నాకు లేనిపోని ఆశలు కల్పించారు. నన్ను మీతో ఏ వూరైనా తీసుకపొండి. లేకపోతే నేను నిజంగా పిచ్చెత్తిపోతాను. మీ పెళ్లాన్ని కూడా తీసుకరండి. మీ యిద్దరికి చాకిరీచేస్తూ మీ పంచను పడి వుంటాను.

XII 14-5-194—

ఓహో ఇవాళ ఉత్తరం రాశారు. ఎల్లాగైతేనేం శాన్నాళ్ళకి రాశారు. వొచ్చిన పెళ్ళాం వొచ్చినట్టే వెళ్ళిపోయింది. ఆవిణ్ణి మీ అత్తారు ఇంత వేగం పంపమన్నారు కాబోలు. పాపం మళ్ళా నేనుకావలనివచ్చేనుకాబోలు. మీకు మీ పెళ్ళాం అంతగొప్ప అయింది. నా మొగుడు నాకు గొప్ప. అసందర్భపు ఉత్తరాలు ఇంతటితో చాలించండి.

XIII 15-5-194—

మళ్ళా మీరు ఉత్తరం రాస్తారనుకోలేదు. నా మొగుణ్ణి తిడుతూ రాశారు. మీరు యింత మర్యాద తెలియని వాళ్ళనుకోలేదు. మీరెంత పెద్ద మనుష్యులో నాకు తెలుసు. మీరు మా ఆయన కాలిగోరికి పోలరు. నేనంటే పెద్ద అభిమానం ఉండే నన్ను పెళ్ళాడారు. మీ లాంటివాళ్ళ సావాసాలు చేసికొన్నాళ్ళు చెడిపోయారు. ఇప్పుడు నన్ను పెళ్ళాడినప్పుడు కన్నా ఎక్కువగా చూస్తున్నారు.

XIV 16-5-194—

నేనూ, నా మొగుడు సుఖంగా ఉండడమే మీకు కావాలా? ఆయన బుద్ధి ఎలాగా మార్చుకొన్నారో మీకు వింతగా ఉన్నదా? మనుషుల బుద్ధులు మారవూ? మీరెంతో మంచివారుగా కనబడి భటాచోరుగా మారిపోలేదు? నాకు మంచిరోజులువొచ్చాయి. అంచేత మా ఆయనకి చెడ్డ బుద్ధులు పోయి మంచి బుద్ధులు వొచ్చాయి.

XV 17-5-194—

మీరు నామీద ఏదో పెద్ద హక్కు ఉన్నట్టు ఉత్తరాలు రాస్తున్నారు. మా ఆయన చెప్పేవాళ్ళు లేక చెడిపోయారు. ఇంకా కుర్రవాడు, మంచి చెడ్డలు బాగా తెలియవు. కొత్తగా ఉద్యోగమై స్వతంత్రమూ, చేతికి డబ్బూ వొచ్చాయి. అంచేత కొన్నాళ్ళు చెడ్డారు. మీరు అంత దగా చేసిన తరువాత నేను బాగా ఆలోచించుకొన్నాను. చిన్నదాన్నయినా నా తెలివికి మా బావగారు మెచ్చుకొన్నారు. మా ఆయనకి బుద్ధి చెప్పగలిగేవాళ్ళు

ఎవ్వరా అని ఆలోచించాను. ఏమైతేతే కానీ అని తెగించి మా బావగారికి ఉత్తరం రాశేశాను. నేను పడుతున్న బాధ మా ఆయన చేస్తున్న పనులు పూసగుచ్చి రాశేశాను. దుఃఖమంతా తీరిపోయేటట్టు రాశేశాను. మా బావ గారితో మాటాడి ఎరగను. కంటబడి ఎరగను. అలాంటి బావగారికీ మొగుడి మీద ఒక చేటభారతం రాశేశాను. మర్నాటికల్లా మా బావగారు దేముడిలాగ వొచ్చిపడ్డారు. ఆయన మా ఇంటికి రాలేదు. 'సానివీధులో కాశారు. సానెమ్మ ఇంట్లో తమ్ముణ్ణి పట్టుకొన్నారు. ఇంటికి యీడ్చుకొచ్చారు. ఎడా పెడా నా ఎదటే తన్నిశారు. బుద్ధిగా ఇహను ఉంటానని ప్రమాణం చేయించుకొన్నారు. నాలుగు రోజులున్నారు. దాంతో మా ఆయనకి బుద్ధి వొచ్చింది. అంచేత నన్నిలాగ బతకనీయండి. మీరు మీ భార్యతో సుఖంగా ఉండండి. నన్ను పూర్తిగా మరిచిపోండి.

## XVI

20-5-194—

మీరు ఉత్తరం రాయరనుకొన్నా. రాశారు. నేనొక్కసారి, ఆఖరి సారి మీ దగ్గరకి రావాలా? మామ్మూలుగా మీరు రమ్మంటే ఎంత ఇష్టం లేకపోయినా వొద్దునేమో! బెదిరిస్తే భయపడతా ననుకొన్నారా? ఈః రాత్రి రాకపోతే నా ఉత్తరాలు మా ఆయనకి పంపిస్తారా? నా సంసారానికి నిప్పు అంటిద్దామని ఉన్నదా? మీకు నా మీద అంత చలవ. పంపండి ఉత్తరాలు. నాకేం భయంలేదు. నా మొగుడు చెడితేనేగదా నేను చెడ్డాను? నేను బుద్ధి తెచ్చుకొని బాగుపడ్డాను. మా ఆయన బుద్ధి మార్చి నేనే బాగుచేశాను. మీ పుట్టుపూర్వోత్తరాలు యోగ్యతలు తెలియనివి కావు. ఇల్లు చేరిన మీ వెధవ మేనగోడలు నిరుడు కడుపు దించుకొని చచ్చిపోయిందిట. ఆ ప్రసాదం మీరే పెట్టారట. మీరంత ఘాతకులు ఎంతకైనా తగినవాళ్ళు.

## XVII

26-5-194—

ఇవాళ్ళ నా పాట విన్నారా? నేను పాడతానని ఎరగరూ? నేను వీణ వాయించుతూ పాడగలను. నా వీణ యీ వూరు తెచ్చుకోలేదు. అంతే అనుకున్నారేమిటి? నాకు ఎన్నెన్నో కుట్టడం వచ్చును. మా స్కూలులో ఆడపిల్లలం నాటకాలు ఎన్నెన్నో వేశాము. నేను మధురవాణి వేషం

వేస్తే ఇరవై తులాల వెండికప్పు యిచ్చారు. నేను మా బడిలో పిల్లలందరి కన్నా బాగా మాటాడేదాన్ని. మా ఆయన రాత్రి పాడమన్నారు. వెన్నెట్లో కూర్చుని హాయిగా పాడాను. మా ఆయన గుండెలకి జారబడి కూచుని పాడాను. తెలిసిందా? నామీద ఇంకా ఆశ పెట్టుకుని ఉన్నారా? తలుపు తోసుకొని మీ గదిలోకి వస్తాననుకుంటున్నారా? నానించి నిద్రపట్టక బాధ పడుతున్నారా ? మీకు అదృష్టంలేదు. మీకు వెతికితే ధైర్యం, తెగింపులేవు. లేకపోతే యిప్పుడు నేనెక్కడ ఉండేదాన్ని, బెజవాడలో మీ పాదాలకే దాసీనై ఉండేదాన్ని. మీకంత కలేజా ఎక్కడిది? మా పెరట్లోకి రమ్మంటే రాలేకపోయారు! మిమ్మలిని నేనెరగనూ? మీ పెళ్ళాన్ని చూశాను. నఖ శిఖ పర్యంతం చూశాను. ఎంత వెతికినా ఏ అవయవానికి అందంలేదు. కాని ఆడదేను. పెళ్ళాడారు కాబట్టి మీ పెళ్ళామేను. మీ అత్తారు స్థితిపరులట. మీకు ముద్దూ ముచ్చటా తీరుతుంది. అయితే పెళ్ళాన్నిమాత్రం నెత్తి మీద దేవతలాగ చూసుకోవాలి. మా అందరికీ నల్లచింతపండు ముద్దలాగ కనబడ్డా మీరు మాత్రం తియ్యని నల్లబెల్లం అనుకోవాలి. బెల్లాన్ని పిల్లలు మండకి రాసుకొని నాకుతారు. మీకింకా ఈ సంగతి తెలియదు. మా ఆయనకి యీ వూరునించి బదిలీ అయిపోయింది. మా బావగారే బదిలీ చేయించారు. మా బావగారి వూరికే బదిలీచేయించారు. మేము వెళ్ళిపోతున్నాము. మీ ఆవిడిని ఆరు నెల్లదాకా మీ అత్తారు పంపమన్నారుట. అలాగ ఒప్పుకోకండి. ఎల్లుండి ఏకాదశి చాలా మంచిది. వెళ్ళి పెళ్ళాన్ని తెచ్చుకొండి. చిత్తగించండి.